సంజయ్ సింగ్ అరెస్ట్

ఎక్సైజ్ పాలసీ కేసులో ఆప్ ఎంపీని అదుపులోకి తీసుకొన్న ఈడీ

- 10 గంటల పాటు ఢిల్లీలోని ఎంపీ నివాసంలో సోదాలు
- సంజయ్ అరెస్టును ఖండించిన ఆమ్ ఆద్మీ పార్టీ
- అక్రమమని, రాజకీయ ప్రతీకార చర్య అని ధ్వజం
- లోక్‌సభ ఎన్నికలపై మోదీకి భయం పట్టుకొన్నది
- వచ్చే ఎన్నికల్లోగా మరిన్ని అరెస్టులు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆప్ కీలక నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌ను అరెస్టు చేసింది. మనీల్యాండరింగ్ ఆరోపణలపై బుధవారం ఉదయం నుంచి ఢిల్లీలోని ఎంపీ నివాసంలో అధికారులు సోదాలు చేపట్టారు. దాదాపు 10 గంటలపాటు ప్రశ్నించిన అనంతరం పీఎంఎల్‌ఏ కింద అరెస్టు చేసినట్టు అధికారులు సాయంత్రం ప్రకటించారు. సంజయ్ సింగ్‌ను గురువారం కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉన్నదని, ఈడీ కస్టడీ కోరే అవకాశం ఉన్నదని సంబంధిత వర్గాలు తెలిపాయి. తన రెస్టారెంట్‌లో ఓ పార్టీ సందర్భంగా ఎంపీ సంజయ్ సింగ్‌ను కలిశానని ఎక్సైజ్ పాలసీ కేసులో అప్రూవర్‌గా మారిన వ్యాపారవేత్త దినేశ్ అరోరా విచారణలో చెప్పాడని ఈడీ పేర్కొన్నది.

తలొగ్గే ప్రసక్తే లేదు: సంజయ్ సింగ్

తన అరెస్టుకు ముందు సంజయ్ సింగ్ ఒక వీడియో సందేశాన్ని రికార్డు చేశారు. అవినీతికి వ్యతిరేకంగా తన పోరాటం కొనసాగుతుందని అందులో పేర్కొన్నారు. చావనైనా చస్తాను కానీ, తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అదానీ స్కామ్‌లను తాను బహిర్గతం చేశానని, ఈడీకి ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి ఓటమి తప్పదని, దాడులు, అరెస్టులు వంటి వాటి ద్వారా విజయం సాధించలేరని స్పష్టం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఈడీ తనను బలవంతంగా అరెస్టు చేస్తున్నదని చెప్పారు.

అరెస్టైన కీలక నేతల్లో మూడో వ్యక్తి

ఢిల్లీలో, పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆప్‌ను కేంద్రంలోని బీజేపీ సర్కార్ లక్ష్యంగా చేసుకొన్నదనే విమర్శలు ఉన్నాయి. ఇందులో భాగంగా ఈడీ తాజాగా అరెస్టు చేసిన ఆప్ ఎంపీ సంజయ్ సింగ్.. ఆ పార్టీ కీలక నేతల్లో మూడో వ్యక్తి కావడం గమనార్హం. అంతకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో డిప్యూటీ సీఎంగా ఉన్న మనీశ్ సిసోడియాను కూడా ఇదే ఎక్సైజ్ పాలసీ కేసులో సీబీఐ అరెస్టు చేసింది. మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌ను ఈడీ ఓ మనీల్యాండరింగ్ కేసులో గత ఏడాది అరెస్టు చేసి జైలుకు పంపింది.

ఆప్‌ను అక్యూజ్‌డ్‌గా ఎందుకు చేర్చలేదు?

ఎక్సైజ్ పాలసీ కేసులో ఆప్ లబ్ధి పొందివుంటే, ఆ పార్టీని మనీలాండరింగ్ కేసులో నిందితజాబితాలో ఎందుకు చేర్చలేదని సుప్రీంకోర్టు బుధవారం ఈడీని ప్రశ్నించింది. 'ఒక రాజకీయ పార్టీకి లబ్ధి చేకూరిందని మీ కేసు చెబుతుంది. అయితే ఆ పార్టీని నిందితుడి లేదా ఇంప్లీడెడ్‌గా ఎందుక చేర్చలేదు' అని ప్రశ్నించింది.

ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

అదానీ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తినందుకే...

ఎంపీ సంజయ్ సింగ్ అరెస్టును ఆప్ ఖండించింది. రాజకీయ ప్రతీకార చర్య అని ఆ పార్టీ నేతలు మండిపడ్డారు. అదానీ అక్రమాలను పార్లమెంట్‌లో లేవనెత్తినందుకు ఆయన్ను అరెస్టు చేశారని ఆరోపించారు. సంజయ్ సింగ్ అరెస్టు పూర్తిగా అక్రమమని ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలపై ప్రధాని మోదీ భయపడుతున్నారనే దానికి తాజా అరెస్టు నిదర్శనమని, ఎన్నికలకు ముందు ప్రతిపక్ష గ్రూపు నుంచి మరిన్ని అరెస్టులు కూడా చేసే అవకాశం లేకపోలేదని పేర్కొన్నారు. అంతకు ముందు సంజయ్ సింగ్ నివాసంలో ఈడీ సోదాలపై కేజ్రీవాల్ స్పందిస్తూ.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదని బీజేపీ గ్రహించిందని, అందుకే తన చివరి ప్రయత్నంలో భాగంగా ఇది చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఎన్నోసార్లు సోదాలు చేశారని, ఒక్క పైసా అక్రమ సొమ్ము కూడా రికవరీ చేయలేకపోయారని అన్నారు. తాము నిజాయితీగా లేకపోతే ఈ సమస్యలన్నీ ఉండేవి కాదన్నారు.

ఈడీ ప్రతీకార చర్యలకు దిగరాదు

- పనితీరు పారదర్శకంగా ఉండాలి
- అరెస్టుకు గల కారణాలను రాతపూర్వకంగా అందించాలి
- కేంద్ర సంస్థపై సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పనితీరుపై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. కేసు దర్యాప్తు సందర్భంగా నిందితులపై ప్రతీకార చర్యలకు పాల్పడకూడదని, సంస్థ పనితీరు పారదర్శకంగా, ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని ఈడీకి సూచించింది. ఈడీ వ్యవహారం ఏకపక్షంగా, పక్షపాతంగా ఉన్నట్టు కనిపిస్తున్నదని పేర్కొంది. గురుగ్రామ్‌కు చెందిన ఓ కంపెనీపై దాఖలైన హవాలా కేసులో.. ఆ కంపెనీ డైరెక్టర్లు బసంత్ బన్సల్, పంకజ్ బన్సల్ అరెస్టును కొట్టివేస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. నిందితులను అరెస్టు చేయడానికి ముందు.. విధిగా వారిని ఎందుకు అదుపులోకి తీసుకుంటున్నారో లిఖితపూర్వంగా తెలియజేయాలని ఆదేశించింది. ఈ కేసులో నిందితులకు వారి అరెస్టుకు గల కారణాలను తెలియజేయకపోవడంపై కోర్టు ఈడీని తీవ్రస్థాయిలో మందలించింది. అరెస్టుకు గల కారణాలను నిందితుల ముందు చదవడం కాదు.. రాజ్యాంగంలోని *ఆర్టికల్ 22(1), హవాలా (పీఎంఎల్‌ఏ) చట్టంలోని సెక్షన్ 19(1)* ప్రకారం రాతపూర్వక ప్రతిని వారికి అందించాలి అని స్పష్టం చేసింది. ఈ కేసులో పరిణామాలు ఈడీ ప్రతికూల పనితీరుకు నిదర్శనంగా ఉన్నాయని పేర్కొంది. ఈడీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేదన్న కారణంతో అరెస్టు చేయడం సరికాదని తెలిపింది. 'హవాలా చట్టం కింద వారు నేరానికి పాల్పడ్డారని చెప్పేందుకు కచ్చితమైన ఆధారాలు సేకరించి అరెస్టు చేయాలి. అంతేగానీ, సమస్లకు స్పందించలేదన్న కారణంతో అరెస్టు చేయకూడదు' అని పేర్కొంది. ఈ కేసులో బన్సల్ సోదరులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించింది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత.. హవాలా చట్టాన్ని సవరించడం ద్వారా ఈడీకి అసాధారణ అధికారాలను కట్టబెట్టారు. బీజేపీ తన రాజకీయ ప్రత్యర్థులపై ప్రతీకార చర్యలకు పాల్పడేందుకు ఈడీని పావుగా వాడుకుంటున్నదన్న ఆరోపణలు ఉన్నాయి.

రణ్‌బీర్‌కు ఈడీ నోటీసులు

ముంబై: బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. మహదేవ్ బెట్టింగ్ యాప్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో శుక్రవారం తమ ఎదుట విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ యాప్‌కు చెందిన పలు వాణిజ్య ప్రమోషన్లలో రణ్‌బీర్ పాల్గొనడమే కాక, యాప్ ప్రమోటర్లలో ఒకరి వివాహ వేడుకల్లో ప్రదర్శన ఇవ్వడానికి పెద్దయెత్తున నగదు తీసుకున్నట్టు ఆరోపణలు రావడంతో ఈడీ నోటీసులు జారీ చేసింది.

అభిషేక్ బెనర్జీకి ఈడీ మళ్లీ సమన్లు

కోల్‌కతా, అక్టోబర్ 4: పశ్చిమ బెంగాల్‌లో ఉపాధ్యాయుల నియామకాల కేసులో టీఎంసీ జాతీయ కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి ఈడీ మరోసారి సమన్లు జారీ చేసింది. ఈ నెల 9న తమ ముందు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఇదే కేసులో ఆయన భార్య రుజిరాకు కూడా నోటీసులు పంపింది. ఆమెను ఈ నెల 11న విచారణకు రావాలని కోరింది. ఎంపీ అభిషేక్‌కు ఈ నెల 3నే ఈడీ నోటీసులు ఇచ్చింది. అయితే ఆయన హాజరుకాలేదు.

ఒడిశాలో ఓబీసీ కులగణన

త్వరలోనే నివేదిక విడుదల

భువనేశ్వర్ : నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ సర్కారు రాష్ట్రంలో ఓబీసీ కులగణన చేపట్టింది. త్వరలోనే నివేదిక విడుదల చేయనుంది. ఈ ఏడాది మేలో ఏర్పాటు చేసిన కమిషన్ ఇప్పటికే సర్వే పూర్తి చేసింది. రాష్ట్ర జనాభాలో 46 శాతం ఓబీసీలు ఉన్నట్టు కమిషన్ సభ్యుడు మితాలీ చిన్నారా తెలిపారు. 211 కులాల సామాజిక, ఆర్థిక, విద్య, కుటుంబ పరిస్థితులపై చేపట్టిన ఈ సర్వే నివేదికను సీఎం నవీన్ పట్నాయక్‌కు అందజేసినట్టు చెప్పారు. ఓబీసీల సర్వే పూర్తితో కులగణన పూర్తి చేసిన ఐదవ రాష్ట్రంగా ఒడిశా నిలిచింది. అంతకుముందు బీహార్, ఎంపీ, మహారాష్ట్ర, హర్యానాలు ఈ సర్వేను నిర్వహించాయి.

భారత వాయుసేన అమ్ములపొదిలో మరో అస్త్రం చేరింది. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తొలి ఎల్‌సీఏ తేజాస్ ట్విన్ సీటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఐఏఎఫ్‌కు అందజేసింది. ఐఏఎఫ్ శిక్షణ అవసరాలకు కోసం దీన్ని తీర్చిదిద్దారు.

మౌంజి బావెండి | లూయిస్ ఇ బ్రస్ | అలెక్సీ ఐ ఎకిమోవ్

క్వాంటం డాట్స్‌పై పరిశోధనలకు నోబెల్

- రసాయన శాస్త్రంలో అమెరికా శాస్త్రవేత్తలకు అత్యున్నత పురస్కారం
- బావెండి, లూయిస్, అలెక్సీకి అవార్డు

స్టాక్‌హోం, అక్టోబర్ 4: 'క్వాంటం డాట్స్'పై అద్భుతమైన పరిశోధనలు చేసిన ముగ్గురు అమెరికా శాస్త్రవేత్తలకు నోబెల్ పురస్కారం దక్కింది. నానో టెక్నాలజీకి సంబంధించి 'క్వాంటం డాట్స్' ఆవిష్కరణలో పరిశోధనలకుగాను మౌంజి బావెండి, లూయిస్ ఇ బ్రస్, అలెక్సీ ఐ ఎకిమోవ్‌లను రసాయన శాస్త్రంలో నోబెల్ ప్రైజ్ వరించింది. ఈ మేరకు బుధవారం రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఒక ప్రకటన విడుదల చేసింది. 'క్వాంటమ్ డాట్స్ అనేవి.. అత్యంత సూక్ష్మమైన నానోపార్టికల్స్. టెలివిజన్, కంప్యూటర్ డిస్‌ప్లేలు, ఎల్ఈడీ బల్బులు సహా వివిధ పరికరాల్లో ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. అంతేగాక ఈ టెక్నాలజీని వాడుతూ వైద్యులు కణితి తొలగింపు ఆపరేషన్లు కూడా చేస్తున్నారు' అని రాయల్ స్వీడిష్ అకాడమీ పేర్కొన్నది. కాగా, విజేతల పేర్లను జ్యూరీ ప్రకటించక ముందే, స్వీడిష్ మీడియాలో లీక్ కావటం తీవ్ర కలకలం రేపింది.

ఏమిటీ క్వాంటం డాట్స్?

కృత్రిమంగా సృష్టించిన అణువుల్ని 'క్వాంటం డాట్స్' అంటారు. సైంటిఫిక్‌గా 'సెమీ కండక్టర్ నానోక్రిస్టల్స్' అని కూడా పిలుస్తారు. వీటి పరిమాణం అత్యంత సూక్ష్మం. ఎంతంటే.. ఒక మీటర్‌ను 100 కోట్ల భాగాలుగా విడగొడితే, అందులో ఒక భాగం నానోమీటర్ అవుతుంది. 'క్వాంటం డాట్స్' విద్యుత్ ఆవేశాన్ని, పారదర్శక స్వభావాన్ని కలిగివుంటాయి. సెన్సార్లు, వైద్య పరికరాలు, ఇండస్ట్రియల్ క్వాలిటీ కంట్రోల్.. ఇలా అనేక విభాగాల్లో వీటిని వినియోగిస్తున్నారు. అత్యంత శక్తివంతమైన సోలార్ సెల్స్‌ను తయారు చేయగలిగామంటే దీనికి కారణం క్వాంటం డాట్స్. రేపటి తరం ఎల్ఈడీల తయారీకి ఇదే ప్రధానమైంది.

ఫైజల్ లోక్‌సభ సభ్యత్వం రద్దు

న్యూఢిల్లీ : ఎన్సీపీ ఎంపీ మహమ్మద్ ఫైజల్ తన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయారు. లక్షద్వీప్ ఎంపీగా ఉన్న ఫైజల్ తనపై ఉన్న హత్యాయత్నం కేసును కొట్టి వేయాలంటూ చేసిన విజ్ఞప్తిని కేరళ హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఈ కేసులో అతనికి శిక్ష పడిన 2023 నుంచి అనర్హుడిని చేస్తున్నట్టు లోక్‌సభ ప్రకటించింది. ఇలా అనర్హుడు కావడం ఫైజల్‌కు ఇది రెండోసారి. హత్యాయత్నం కేసులో ఫైజల్‌కు పదేండ్ల శిక్ష విధించడంతో ఈ ఏడాది జనవరి 25న అతని లోక్‌సభ సభ్యత్వం రద్దయ్యింది.

సముద్ర ఉచ్చులో చైనా అణు జలాంతర్గామి

55 మంది మృతి

లండన్ : చైనా అణు జలాంతర్గామి తాను తీసిన గోతిలో తానే పడింది. ఫలితంగా 55 మంది చైనా సెయిలర్ల ప్రాణాలను పొట్టనబెట్టుకుంది. ఎల్లో సముద్రంలో అమెరికా, మిత్ర దేశాల జలాంతర్గాములు ప్రవేశించకుండా చైనా రహస్యంగా భారీ వలలను ఏర్పాటు చేసింది. వీటిలో చైనా అణు జలాంతర్గామి చిక్కుకుంది. అన్ని వ్యవస్థలు మొరాయించడంతో బయటపడే మార్గం లేక అందులోని 55 మంది ఊపిరాడక మృతి చెందినట్టు తెలిసింది.

82 మంది గల్లంతు

22 మంది సైనికులే

- సిక్కింను ముంచెత్తిన ఆకస్మిక వరదలు.. 10 మంది మృతి

ఆకస్మిక వరదల కారణంగా ఉత్తర సిక్కిం ప్రాంతంలో నీట మునిగిన ఇండ్లు

గ్యాంగ్‌టక్, అక్టోబర్ 4: భారీ వర్షాలతో ఈశాన్య రాష్ట్రం సిక్కింలో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఉత్తర సిక్కింలోని లోనాక్ సరస్సు ప్రాంతంలో మంగళవారం రాత్రి కుంభవృష్టి కురిసింది. లాచెన్ లోయలోని తీస్తా నదిలోకి వరద నీరు పోటెత్తింది. దీంతో తీస్తా నది బేసిన్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత సంభవించిన ఆకస్మిక వరదల్లో 82 మంది గల్లంతయ్యారు. వీరిలో 22 మంది జవాన్లు, మరో 60 మంది పౌరులు ఉన్నారు. గల్లంతైన వారిలో 10మంది మరణించారని, మిగతా వారి కోసం గాలింపు చేపట్టినట్టు అధికారులు బుధవారం వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో చుంగ్‌థాంగ్ డ్యామ్ నుంచి నీరు విడుదల చేయడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారిందని, తీస్తా నదిలో నీటి మట్టం ఒక్కసారిగా 15-20 అడుగుల మేర పెరిగిందని అధికారులు తెలిపారు. దీంతో అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో వరదలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. పరిస్థితి తీవ్రత నేపథ్యంలో ఈ ప్రకృతి వైపరీత్యాన్ని సిక్కిం ప్రభుత్వం విపత్తుగా ప్రకటించింది.

నీట మునిగిన ఆర్మీ పోస్టులు

వరదల తీవ్రతకు లాచెన్ లోయలోని ఆర్మీ పోస్టులు నీట మునిగాయి. సింగ్తమ్ ప్రాంతంలో ఆర్మీ వాహనాలు కొట్టుకుపోయాయి. అందులోని 22 మంది గల్లంతైనట్టు ఆర్మీ ఈస్టన్ కమాండ్ ఓ ప్రకటనలో వెల్లడించింది. వరదలు సంభవించిన ప్రాంతంలో ఇంటర్నెట్ సదుపాయం సరిగా లేకపోవడంతో అక్కడి ఆర్మీ సిబ్బందిని సంప్రదించడం కష్టంగా మారిందని సైనిక వర్గాలు తెలిపాయి.

దెబ్బతిన్న ఇండ్లు.. కొట్టుకుపోయిన బ్రిడ్జిలు

ఆకస్మిక వరదలతో తీస్తా నది బేసిన్‌లోని దిక్చు, సింగ్తమ్, రంగ్పో పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల రహదారులు నీటమునిగాయి. వందలాది ఇండ్లు దెబ్బతిన్నాయి. తీస్తా నది ఉగ్రరూపానికి రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌కు 30 కిలోమీటర్ల దూరంలోని సింగ్తమ్ వద్ద ఉన్న స్టీల్ బ్రిడ్జి ఒకటి కొట్టుకుపోయింది. మరో 13 చోట్ల బ్రిడ్జిలు కూలిపోయాయి. పశ్చిమబెంగాల్, సిక్కింను కలిపే 10వ నంబర్ జాతీయ రహదారి చాలా చోట్ల దెబ్బతిన్నది. వరదల నేపథ్యంలో మంగన్, గ్యాంగ్‌టక్, పాక్యోంగ్, నమ్చి జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఈ నెల 8 వరకు సెలవులు ప్రకటించినట్టు విద్యాశాఖ పేర్కొన్నది.

మహారాష్ట్రలో కుప్పకూలిన ఆరోగ్య వ్యవస్థ

- ప్రభుత్వ దవాఖానల్లో ఆగని రోగుల మరణాలు
- తాజాగా నాగపూర్‌లో 25 మంది మృతి
- మూడు రోజుల్లో 78 మంది మృత్యువాత

నాందేడ్ దవాఖానలో సంచరిస్తున్న పంది

ముంబై, అక్టోబర్ 4: బీజేపీ పాలిత మహారాష్ట్రలో ప్రజా ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలింది. ప్రభుత్వ దవాఖానల్లో రోగుల మరణాలు ఆగటం లేదు. బుధవారం నాగపూర్‌లోని రెండు ప్రభుత్వ దవాఖానల్లో 25 మంది పేషెంట్లు ప్రాణాలు కోల్పోయారు. గత మూడు రోజుల్లో వివిధ జిల్లాల్లో మొత్తం 78 మంది చనిపోగా, ఇందులో 30 వరకు నవజాత శిశు మరణాలున్నాయని సమాచారం. ఈ నేపథ్యంలో బీజేపీ నేతృత్వంలోని ఏక్‌నాథ్ షిండే సర్కార్‌పై విపక్షాలు మండిపడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఆరోగ్య వ్యవస్థ చతికిలపడిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నాందేడ్ దవాఖానల్లో 31 మంది, థాణేలో 18మంది చనిపోయిన సంగతి తెలిసిందే. తాజాగా నాగపూర్‌లో 24 గంటల వ్యవధిలో (బుధవారం ఉదయం 8 గంటల నాటికి) ప్రభుత్వ మెడికల్ కాలేజీ, దవాఖాన (జీఎంసీహెచ్)లో 16 మంది, ఇందిరాగాంధీ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో మరో 9 మంది రోగులు ప్రాణాలు కోల్పోయారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. 1900 పడకల జీఎంసీహెచ్ దవాఖానలో రోజూ సగటున 10 నుంచి 12 మంది రోగులు ప్రాణాలు కోల్పోతారని దవాఖాన డీన్ రాజ్ గాజ్‌భాయ్ తెలిపారు.

సుమోటోగా బాంబే హైకోర్టు విచారణ

ప్రభుత్వ దవాఖానాల్లో మరణాలపై బాంబే హైకోర్టు స్పందించింది. నాందేడ్, ఔరంగాబాద్ దవాఖానల్లో రోగుల మరణాలపై సుమోటాగా కేసు నమోదుచేసి విచారణ చేయబోతున్నట్టు బుధవారం ప్రకటించింది. రాష్ట్రంలో ప్రజా ఆరోగ్యంపై బడ్జెట్ వివరాల్ని శుక్రవారం లోగా కోర్టుకు సమర్పించాలని ఏక్‌నాథ్ షిండే సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది.

మహా ప్రభుత్వంలో ముసలం

- డిప్యూటీ సీఎం అజిత్ పవార్ అసంతృప్తి
- క్యాబినెట్ సమావేశానికి డుమ్మా
- అమిత్ షాతో కీలక భేటీకి గైర్హాజరు
- మంత్రి పదవుల కేటాయింపుపై అసమ్మతి

అజిత్ పవార్

ముంబై, అక్టోబర్ 4: మూడు పార్టీల సంకీర్ణంతో నెట్టుకొస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వంలో ముసలం మొదలైంది. తమ పార్టీ అధినేత శరద్ పవార్ నుంచి విడిపోయి వేరే కుంపటి పెట్టుకుని అధికారంలో భాగస్వామిగా ఉన్న డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశానికి డుమ్మా కొట్టడం, కేంద్ర మంత్రి అమిత్ షాతో జరిగే సమావేశానికి సీఎం ఏక్‌నాథ్ షిండే, మరో డిప్యూటీ సీఎం దేవేందర్ ఫడ్నవీస్‌తో ఢిల్లీకి వెళ్లకుండా ఇంటికే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. అధికారంలో తాను భాగస్వామిగా ఉన్నప్పటికీ మంత్రి పదవుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని ఆయన అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తున్నది. హనీమూన్ కూడా ముగియకుండానే.. మహారాష్ట్ర ప్రభుత్వంలో రాజకీయ అస్వస్థత ప్రారంభమైందని, ఇక ఆ ప్రభుత్వం ఎంతోకాలం అధికారంలో ఉండదని విపక్షాలు వ్యాఖ్యానించాయి. ఎన్సీపీ నేత అజిత్ పవార్ 'రాజకీయ అస్వస్థత'కు గురయ్యారని, జిల్లాల్లో ఇన్‌చార్జి మంత్రుల నియామకంలో జరుగుతున్న జాప్యంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారని విపక్ష నేత విజయ్ వాడెట్టివార్ పేర్కొన్నారు. 'ట్రిపుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి వచ్చి 3 నెలలు మాత్రమే అయ్యింది. అందులో ఒక వర్గం తీవ్ర అసంతృప్తితో ఉందని విన్నా. అయినా హనీమూన్ ఇంకా ముగియకపోయినా వారు ఇప్పటికే తీవ్ర నిరాశలో ఉన్నారు. అలాంటప్పుడు ప్రభుత్వాన్ని ఎవరు నడుపుతారు' అంటూ ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే వ్యాఖ్యానించారు. అజిత్ గొంతు నొప్పితో బాధపడుతున్నారని, స్వల్పంగా జ్వరం కూడా ఉందని, అందుకే ఆయన క్యాబినెట్‌కు హాజరు కాలేదని ఆ పార్టీ నేత తెలిపారు.

ఉజ్వల లబ్ధిదారులకు ఎల్పీజీ సబ్సిడీ 100 పెంపు

ఎన్నికల ముందు కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ: లోక్‌సభతోపాటు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రంలోని మోదీ సర్కారు ఒక్కొక్కటిగా తాయిలాలు ప్రకటిస్తున్నది. అధికారంలోకి వచ్చింది మొదలు వంటగ్యాస్‌పై ఎడాపెడా ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచిన మోదీ సర్కారుకు ఎన్నికల వేళ ప్రజలపై ప్రేమ పుట్టుకొచ్చింది. ఉజ్వల పథకం లబ్ధిదారులకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌పై ఇచ్చే రాయితీని రూ.200 నుంచి రూ.300కు పెంచింది. ఈ మేరకు బుధవారం కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

ఎన్నికల స్టంట్

రాయితీ పెంపు నిర్ణయం ఎన్నికల స్టంట్ అని విపక్షాలు విమర్శించాయి. ఎన్నికల ముందు ధరలు తగ్గించినట్టు నటించడం, తర్వాత వాయించడం బీజేపీ నైజం అని కాంగ్రెస్ నేత అజయ్ కుమార్ విమర్శించారు.

ఎన్ఎంసీ ఉత్తర్వులను ఉపసంహరించాలి: స్టాలిన్

చెన్నై, అక్టోబర్ 4: నూతన వైద్య కళాశాలల ప్రారంభాన్ని కట్టడి చేస్తూ ఇటీవల నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) జారీచేసిన నోటిఫికేషన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఓ లేఖ రాశారు. ఎన్ఎంసీ నోటిఫికేషన్ 'తిరోగమన పరిస్థితి'ని సృష్టించిందని, 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యాక జారీ అయిన ఈ నోటిఫికేషన్ చట్టపరంగా ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్ఎంసీ నోటిఫికేషన్‌ను వెంటనే సస్పెండ్ చేసేలా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖను ఆదేశించాలని ప్రధానిని కోరారు.

అవినీతి నేతలకు న్యాయ రక్షణా?

పరిశీలిస్తామన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: పార్లమెంట్‌లో మాట్లాడటానికి లేదా ఓటు వేయడానికి లంచం తీసుకున్న శాసనకర్తలపై ప్రాసిక్యూషన్ నిర్వహించకుండా మినహాయింపును ఇస్తూ 1998 జేఎంఎం లంచం కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు శాసనకర్తల చర్యలు నేరపూరితం అయినప్పటికీ వర్తిస్తుందా అన్న విషయాన్ని తాము పరిశీలిస్తామని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది. 1998లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం చట్టసభలో మాట్లాడటానికి, లేదా ఓటు వేయడానికి లంచం తీసుకున్న ఎంఎల్‌ఏలు, ఎంపీలకు విచారణ నుంచి నుంచి మినహాయింపు ఇచ్చింది. 1998 నాటి జేఎంఎం ముడుపుల కేసు తీర్పును పునః పరిశీలించేందుకు గత నెల 20న ధర్మాసనం అంగీకరించింది.

మీడియా స్వేచ్ఛపై నిరంతర దాడి

సీజేఐకు 16 మీడియా సంఘాల లేఖ

న్యూఢిల్లీ: దేశంలో ప్రస్తుతం మీడియా స్వేచ్ఛ ప్రమాదంలో ఉన్నదని, నిరంతరంగా దాడి జరుగుతున్నదని జర్నలిస్టు సంఘాలు, మీడియా సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ విషయంలో న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోవాలని, మీడియా స్వేచ్ఛను కాపాడాలని కోరుతూ దేశవ్యాప్తంగా ఉన్న 16 జర్నలిస్టు, మీడియా సంస్థలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు లేఖ రాశాయి. ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ 'న్యూస్‌క్లిక్'కు చెందిన కార్యాలయాలు, జర్నలిస్టుల ఇండ్లలో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసుల సోదాలు, సంస్థ ఆఫీస్ సీజ్, న్యూస్‌క్లిక్ డైరెక్టర్ ప్రబీర్ పుర్కాయస్థతో పాటు పలువురి అరెస్టు వంటి పరిణామాల నేపథ్యంలో ఈ లేఖ రాశాయి.

ప్రశ్నిస్తే రాజద్రోహం అంటారా?: న్యూస్‌క్లిక్

న్యూఢిల్లీ: పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే ప్రభుత్వ చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని న్యూస్ పోర్టల్ న్యూస్‌క్లిక్ పేర్కొంది. ప్రభుత్వంపై చేసిన విమర్శలు రాజద్రోహంగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నించింది. మంగళవారం తమపై జరిపిన దాడుల సందర్భంగా ఢిల్లీ పోలీసుల వైఖరిని తప్పుబట్టింది. తమపై మోపిన ఆరోపణలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వడం కానీ, దానికి సంబంధించిన సమాచారం కానీ ఏమీ ఇవ్వకుండానే తమ కార్యాలయాలపై సోదాలు జరిపారని ఆరోపించింది.